క్లుప్తంగా

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



ప్రభాకరరావు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

జి.సిగడాం: అంకితభావంతో పనిచేసే ఉద్యోగికి సమాజంలో ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి అరుణ కుమారి అన్నారు. మండలంలోని సంతవురిటి బీసీ వసతి గృహంలో వార్డెన్‌గా పనిచేసి ఇటీవల పదవీ విరమణ చేసిన గుంటుకు ప్రభాకరరావు, భారతి దంపతుల సన్మానం, ఆత్మీయ సభలో సోమవారం ఆమె పాల్గొన్నారు. అనంతరం పొందూరు జేవీఆర్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వసతి గృహంలో విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలంటే విద్యతోపాటు క్రమశిక్షణ ఎంతో అవసరమన్నారు. ప్రభాకరరావు సేవలపై పలువురు మాట్లాడి కొనియాడారు. కార్యక్రమంలో వార్డెన్ సంఘం నాయకులు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ బాక్సింగ్ పోటీలకు ఇద్దరు ఎంపిక



జాతీయ పోటీలకు ఎంపికైన బాక్సర్లతో డీఎస్‌డీఓ శ్రీధర్‌రావు, కోచ్ ఉమ

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయస్థాయి జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్–2025 పోటీలకు జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైనవారిలో ఎస్.దేవివరప్రసాద్ (52–54 కేజీల విభాగం), జి.సత్యభార్గవ్ (80–85 కేజీల విభాగం) ఉన్నారు. వీరు ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు హర్యానాలోని రూతక్ వేదికగా జరిగే మెగా టోర్నీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. విశాఖపట్నంలోని గాజువాక వేదికగా ఈ నెల 2, 3 తేదీల్లో జరిగిన 6వ ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్స్ బాక్సింగ్ పోరులో వీరిద్దరు బంగారు పతకాలు సాధించడంతో నేరుగా జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. కాగా జాతీయ పోటీలకు ఎంపికైన వీరితో పాటు డీఎస్‌ఏ బాక్సింగ్ కోచ్ ఉమామహేశ్వర్‌ను డీఎస్‌డీఓ శ్రీధర్‌రావు సోమవారం కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణంలో అభినందించారు. పోటీలకు వెళ్లేందుకు అవసరమైన ఆర్థిక సాయాన్ని లండ అనిల్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో బాక్సింగ్ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీఏ లక్ష్మణ్‌దేవ్, భీమేశ్వర బాక్సింగ్ క్లబ్ అధ్యక్షుడు బలగ సీతారాం, వంగా మహేష్, కోచ్‌లు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని శాంతా కల్యాణ్ అనురాగ నిలయంలో ఆంపోలుకు చెందిన క్యాన్సర్ బాధితుడు ఉట్ల హేమంత్ కుమార్ కుటుంబానికి సాయిబాబా ఈవెంట్స్ అధినేత సాయిబాబా మూడు నెలల నిత్యావసర సరుకులను రెడ్‌క్రాస్ చైర్మెన్ జగన్మోహన రావు చేతులమీదగా సోమవారం అందించారు. కార్యక్రమంలో ఉర్లం శివతేజ, రెడ్‌క్రాస్ ప్రతినిధి నంది ఉమాశంకర్, సాయి సుధాకర్, లలిత, బొట్టా సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సెలవు రోజుల్లో తరగతుల నిర్వహణ సరికాదు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలో 80 ఫీట్ రోడ్డులోని పలు స్కూళ్లు, కాలేజీల్లో సెలవు రోజుల్లో సైతం తరగతులు నిర్వహించడం సరికాదని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు హరీష్, చందు, జయరాంలు మండిపడ్డారు. ఈ మేరకు శ్రీకాకుళం నగరంలోని పలు కళాశాలల యాజమాన్యాలతో సోమవారం మాట్లాడి ప్రిన్సిపాల్స్‌ని నిలదీశారు. సెలవు దినాల్లో తెరిచిన కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సెలవుల్లో తరగతులు నిర్వహించడం వల్ల విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనలు పాటించని కార్పొరేట్, ప్రైవేట్ యాజమాన్యాల గుర్తింపు రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ టౌన్ కమిటీ నాయకులు కార్తీక్, భాను, భరత్, శివ తదితరులు పాల్గొన్నారు.

మెగా కంటి వైద్య శిబిరం రేపు

రణస్థలం: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఇడదాసుల విద్యా ఆరోగ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రణస్థలం సూర్య ఆస్పత్రి ఆవరణలో ఈనెల 18వ తేదీన ఉచిత కంటి మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఇడదాసుల తిరుపతిరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రణస్థలం, లావేరు మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సచివాలయం..

సేవలు నిర్వీర్యం

- ఉద్యోగులను కుదిస్తున్న ప్రభుత్వం
- ఇప్పటికే ఉత్తర్వులు జారీ
- ప్రతి సచివాలయంలో 6 నుంచి 8 మంది ఉద్యోగులు



ఎచ్చెర్ల సచివాలయం

ఎచ్చెర్ల: ప్రభుత్వ సేవలను ప్రజల ముందుకు తీసుకొస్తూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. అధికారంలోకి రాగానే వలంటీర్ వ్యవస్థను పక్కన పెట్టేసింది. ఇప్పుడు సచివాలయ ఉద్యోగులను కుదిస్తోంది. దీంతో ప్రజలు చాలావరకు పనులకు మండల కేంద్రాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. వాట్సాప్‌లో 161 సేవలను తీసుకొచ్చినట్లు ప్రచారం చేసుకున్నా, వాటిని ఎలా వినియోగించుకోవాలో ఇప్పటికీ చాలామందికి తెలియక ఇబ్బందులు పడుతున్నారు.

234 మంది ఉద్యోగులు

మండల వ్యాప్తంగా 26 గ్రామ సచివాలయాలు ఉండగా, వాటిలో 234 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఈ సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి వచ్చి గత నెల 31వ తేదీతో ఐదు సంవత్సరాలు పూర్తికావడంతో ఉద్యోగులను తగ్గించేలా ఉత్తర్వులను తీసుకొచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు ప్రజలకు నిస్వార్థమైన సేవలు సకాలంలో అందించేవారు. అటువంటి వ్యవస్థలో హేతుబద్ధీకరణ అంటూ ఉద్యోగులను తగ్గించేస్తున్నారు. ఒకే సచివాలయంలో ఐదేళ్లు పనిచేసిన ఉద్యోగులకు బదిలీలు తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు.

పనిచేసే ఉద్యోగులు ఇలా..

కూటమి ప్రభుత్వం గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగుల హేతుబద్ధీకరణ, బదిలీలను ఒకేసారి చేస్తోంది. ఇప్పటికే ఈ విషయమై సూచనలు చేసిందని అధికారులు చెబుతున్నారు. జనాభా ప్రకారం సచివాలయాలను కొన్ని కేటగిరీలుగా విభజించింది. ఏ–కేటగిరీలో ఆరుగురు, బీ– కేటగిరీలో ఏడుగురు, సీ–కేటగిరీలో 8 మంది ఉద్యోగులను ఉంచేలా నిర్ణయించారు. అదే గత ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థలో భాగంగా ప్రతీ సచివాలయం పరిధిలో 8 నుంచి 12 మంది వరకు ఉద్యోగులు పనిచేసేవారు. నేడు కూటమి ప్రభుత్వం 6 నుంచి 8 మంది ఉద్యోగులు పనిచేసేలా కుదింపు చేసింది.

బదిలీల్లో వీరికి ప్రాధాన్యం

కూటమి ప్రభుత్వం సచివాలయం ఉద్యోగులను బదిలీ చేసే క్రమంలో కొంతమందికి ప్రాధాన్యమిచ్చారు. అంధులు, మానసిక దివ్యాంగులైన పిల్లల తల్లిదండ్రులు, 40 శాతం అంగవైకల్యం ఉన్నవారు, క్యాన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ, న్యూరో సర్జరీ, కిడ్నీ మార్పిడి చేయించుకున్న వారితో పాటు గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లకు పైగా పనిచేసిన వారికి ప్రాధాన్యం కల్పిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలు, రైతులకు అందుబాటులో ఉండేలా గ్రామాల్లోనే అన్ని రకాల సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. వాటిలో ప్రధానంగా సచివాలయ వ్యవస్థ అని చెప్పక తప్పదు. అన్ని రకాల సేవలు ప్రజలకు దక్కేలా ఎంతోమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. అటువంటి సచివాలయ వ్యవస్థలో హేతుబద్ధీకరణలో భాగంగా ఉద్యోగుల సంఖ్యను కూటమి ప్రభుత్వం తగ్గించేందుకు చర్యలు చేపట్టింది.

నెలాఖరులోగా బదిలీలు



సచివాలయ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ ఈ నెలాఖరులోగా జరుగుతుంది. ఐదేళ్ల పాటు ఒకేచోట సచివాలయంలో పనిచేసే ఉద్యోగులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిందే. బదిలీలకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. గత నెల 31తో సచివాలయ ఉద్యోగుల గుడువు ఐదు సంవత్సరాలు పూర్తయ్యింది. ప్రభుత్వ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలి.

– హరికృష్ణ, ఎంపీడీవో, ఎచ్చెర్ల

టీజీఐ కార్మికులకు శాశ్వత సెటిల్‌మెంట్ చేయాలి



ధర్నా చేస్తున్న టీజీఐ కార్మికులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: టీజీఐ కార్మికులకు శాశ్వత సెటిల్‌మెంట్ చేయాలని, పెండింగ్ జీతాలు చెల్లించాలని యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి బి.అప్పలరాజు కోరారు. ఈ మేరకు సోమవారం ఉదయం స్థానిక ఎన్‌జీవో హోమ్ నుంచి జిల్లా పరిషత్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన ధర్నాలో వారు మాట్లాడుతూ.. టీజీఐ కంపెనీ స్థాపించిన 20 సంవత్సరాల నుంచి కార్మికులందరూ పనిచేస్తున్నారని తెలిపారు. గత 6 సంత్సరాలు నుంచి కంపెనీని సాంకేతిక కారణాలతో మూసివేశారని పేర్కొన్నారు. అయితే ఇంతకాలం అవుతున్నా యాజమాన్యం ఎటువంటి సెటిల్‌మెంట్ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ మూసివేసిన 5 నెలలకు ముందు కాలానికి కూడా ఎటువంటి జీతాలు చెల్లించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. భేషరుతుగా యాజమాన్యం దిగివచ్చి వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అధికార యంత్రాంగం చొరవ చూపాలని కోరారు. లేకపోతే కార్మికులతో పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డీఆర్వో వెంకటేశ్వరావుకి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు పి.రాము, ఎన్.ప్రసాద్, జి.కామయ్య, వి.ఆదినారాయణ, బి.లక్ష్మణ, గురుమూర్తి, లచ్చయ్య, ఎస్.రాంబాబు, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక పాలకొండ రోడ్డులో ఉన్న ఆధ్యాత్మిక గ్రంథాలయమైన ఉపనిషన్మందిరం నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. ఎన్నికల అధికారిగా విశ్రాంత డీఈవో బి.మల్లేశ్వరరావు వ్యవహరించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. అలాగే గతేడాది జమ ఖర్చుల వివరాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఉపనిషన్మందిరం నూతన కమిటీ అధ్యక్షుడిగా గుమ్మా నగేష్, కార్యదర్శిగా విశ్వనాథం కామేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా పప్పు పతంజలి శాస్త్రి, సనపల నారాయణమూర్తి, బారువ కోమలరావు, ఈశ్వర సూర్యసంపత్ కుమార్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నిష్టల నరసింహమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శిగా మందుల మోహనరావు, సహ కార్యదర్శులుగా పి.రామ్ మనోహర్, చాగంటి బాపయ్య, ఎన్.శ్రీమన్నారాయణ, తెన్నేటి విక్రమశర్మ, పాగోటి బాబూరావు, కోశాధికారిగా గుంటుకు విశ్వేశ్వరరావు, సహ కోశాధికారిగా డి.జి.పట్నాయిక్, సభ్యులుగా భాస్కరభట్ల శ్రీరామ శర్మ, కప్పగంతుల వెంకటరమణారావు, పీవీఎస్ సాయి ప్రసాద్, రంగడు ప్రసాదరావు, ఎన్ఎస్ఎన్ స్వామి, పెద్ది ఈశ్వర రావు, నేరెళ్ల విజయలక్ష్మీ, గోవిందు లలిత, డి.అరుణకుమారిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పరామర్శ



రణస్థలం: ముకుందను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం పట్టణంలోని పలు కుటుంబాలను మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు సోమవారం పరామర్శించారు. రామకృష్ణా నగర్ కాలనీలో నివాసముంటూ ఇటీవల మరణించిన పులఖండం శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను, జెండాల వీధిలోని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అమీరూల్లా బేగ్ సతీమణి ఖామారజహాన్ బేగం ఇటీవల ఆకస్మికంగా మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యాన్నిచ్చారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ముజ్జీపూర్ రెహమాన్, ఎంఏ బేగ్, డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్, గుమ్మా నగేష్, బైరి మురళీధర్, కింజరాపు రమేష్, ఆబోతుల రామ్మోహన్‌రావు, లుకలాపు గోవిందరావు, మోహనరావు, తులసీ తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలోని బంటుపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ పాసపు ముకుంద ఇటీవల కాలికి శస్త్రచికిత్స చేయించుకున్నాడు. దీంతో ఆయనను మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సోమవారం పరామర్శించారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు సనపల నారాయణరావు, పిన్నింటి సత్యంనాయుడు, బోర సాయిరామ్‌రెడ్డి, దన్నాన సీతారాం, చిన్ని కృష్ణ తదితరులు ఉన్నారు.

విధుల్లో చేరిన సునీల్‌కుమార్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయ సూపరింటెండెంట్‌గా పి.సునీల్‌కుమార్ సోమవారం విధుల్లో చేరారు. ఈయన ఇంతవరకు సింహాచలం దేవస్థానంలో విధులు నిర్వర్తించి.. తాజా బదిలీల్లో భాగంగా అరసవల్లి వచ్చారు. ఈయనతో పాటు సీనియర్ అసిస్టెంట్ డి.వెంకటరమణమూర్తి, జూనియర్ అసిస్టెంట్ బాల భాస్కర్ సాయి తదితరులంతా సోమవారం విధుల్లో చేరారు. వీరంతా ముందుగా ఆలయ ఈవో ప్రసాద్, ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

అరసవల్లి: జిల్లాలోని లావేరు, ఎచ్చెర్ల మండలాల్లోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు శ్రీకాకుళం డివిజన్ ఆపరేషన్స్ ఈఈ పైడి యోగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ ఫీడర్ల మరమ్మతులు, అలాగే కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటు పనుల కారణంగా లావేరు మండలంలోని మురపాక, పెద్దరావుపల్లి ఫీడర్ల పరిధిలో పెద్దమురపాక, చిన మురపాక, ఆరంగిపేట, బయ్యన్నపేట తదితర గ్రామాలు, అలాగే ఎచ్చెర్ల మండలంలోని బడివానిపేట ఫీడర్ పరిధిలో కొయ్యాం, బడివానిపేట, జాలారికొయ్యాం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లుగా ప్రకటించారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

దరఖాస్తులు ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం నగరంలో ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు సీడీపీవో పి.నాగరాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు పరిధిలో ఆరు(6) అంగన్‌వాడీ సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటి కోసం ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. దరఖాస్తులు 20వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా అర్బన్ ప్రాజెక్టు కార్యాలయానికి అందించాలని కోరారు. నగరంలోని 26వ వార్డు యాత వీధి అంగన్‌వాడీ కేంద్రంలో 1 పోస్టు, 13వ వార్డు రాచకట్లవీధి అంగన్‌వాడీ కేంద్రంలో 1 పోస్టు, 35వ వార్డు కస్పావీధి అంగన్‌వాడీ కేంద్రంలో 1 పోస్టు, 32వ వార్డు జెడ్పీ ఎంబజీ 2 పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో 1 పోస్టు, 1వ వార్డు హరిజన వీధి–1 పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో 1 పోస్టు, 43వ వార్డు శ్రీశైన వీధి అంగన్‌వాడీ కేంద్రంలో 1 పోస్టు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు అర్బన్ ప్రాజెక్టు కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

ఏడాది పాలనలో అన్నీ మోసాలే



వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ తదితరులు

- మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్
- వెన్నుపోటు పుస్తకం ఆవిష్కరణ

రణస్థలం: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో అన్నీ మోసాలు, వైఫల్యాలేనని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వెన్నుపోటు అనే పుస్తకాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, డైవర్సన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ అమలు చేయలేని అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే అక్రమ అరెస్టులకు తెర తీస్తోందన్నారు. గతంలో అమ్మఒడిని అర్థఒడిగా అభివర్ణించిన మంత్రి లోకేష్, మరి ఇప్పుడు పేరు మార్చి అవే నియమాలను పాటించడాన్ని ఏమనాలని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, దౌర్జన్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, జెడ్పీటీసీ కాయల రమణ, మీసాల సీతంనాయుడు, రాష్ట్ర యువజన సంయుక్త కార్యదర్శి పిన్నింటి సత్యంనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు డోల వెంకటరమణ, దన్నాన రాజీనాయుడు, బోర సాయిరామ్‌రెడ్డి, ఎచ్చెర్ల నియోజకవర్గ ఇంటిలెక్చువల్స్ అధ్యక్షుడు పైడి శ్రీనివాసరావు, ఎంపీటీసీ కరిమజ్జి రమణ, నాయకులు కూనపు నరసింగరావు, పోలీసు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



శ్రీకూర్మంలో ఆసనాలు వేస్తున్న దృశ్యం

గార: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సోమవారం శ్రీకూర్మంలో కూర్మనాథాలయ కామదహన మంటపం వద్ద యోగాంధ్రా కార్యక్రమం నిర్వహించారు. అందరి సహకారంతో శ్రీకూర్మం క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామన్నారు.

కార్యక్రమంలో డ్వామా పీడీ సుధాకర్, ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, తహసీల్దార్ ఎం.చక్రవర్తి, ఎంపీడీవో శిమ్మ రామ్మోహనరావు, సర్పంచ్ జి.అనిత తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి



బాల సుబ్రహ్మణ్యం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బాపూజీ కళామందిర్‌లో ఘంటసాల, బాలు, జి.ఆనంద్ (జీబీఏ) స్వరమాధురి వెల్ఫేర్ అండ్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రముఖ గాయకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బండారు రమణమూర్తి సంగీత సారథ్యంలో జరిగిన సినీ సంగీత విభావరిలో పలువురు గాయకులు బాలు పాడిన సినీ గీతాలను చక్కగా పాడి వినిపించారు. అనంతరం డబ్బింగ్ ఆర్టిస్టు ఆల్ ఇండియా రేడియో బీ గ్రేడ్ సింగర్ కె.భాస్కరరావు దంపతులను బాల సుబ్రహ్మణ్యం పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, ఎంవీ కామేశ్వరరావు, బలివాడ మల్లేశ్వరరావు, దుర్గా శ్రీనివాస్, పి.వైకుంఠరావు, డాక్టర్ సుదీర్, నల్లి ధర్మారావు, మన్యం జిల్లా డీపీఆర్‌వో ఎల్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

బాధ్యతల స్వీకరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం తహసీల్దార్ కార్యాలయం సూపరింటెండెంట్‌గా ఎస్.చక్రవర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన సూపరింటెండెంట్ పి.శ్రీనివాసరావు నరసన్నపేట తహసీల్దార్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. అలాగే చక్రవర్తి ఇదే కార్యాలయంలో సీఎస్‌డీటీగా పనిచేశారు. అలాగే ఇదే కార్యాలయంలో రీసర్వే డీటీ పనిచేసిన పి.అనిల్ కుమార్ ఇదే కార్యాలయంలో సీఎస్‌డీటీగా వెళ్లారు. శ్రీకాకుళం తహసీల్దార్ కార్యాలయం రీసర్వే డీటీగా పి.ప్రకాశ్ విధుల్లో చేరారు.

రిమ్స్ అన్నపూర్ణకు రూ.20 వేల విరాళం



విరాళం అందజేస్తున్న దామోదరరావు

శ్రీకాకుళం కల్చరల్: రిమ్స్‌లో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యదాన అన్నపూర్ణ సంఘం అన్నప్రసాద వితరణకు బ్యాంకర్స్ కాలనీకి చెందిన ఉప్పు దామోదరరావు రూ.20 వేలు విరాళంగా అందజేశారు. సోమవారం దామోదరరావు కుమారులు సాయినీల్, సాయి శ్రావణ్‌ల పుట్టిన రోజు పురస్కరించుకొని అధ్యక్షుడు గంగుల రమణబాబుకు విరాళం అందజేసినట్లు జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సత్య జువెలర్స్ కృష్ణారావు, సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

శంకర విజయంపై ప్రవచనాలు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బాపూజీ కళా మందిర్‌లో ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు శంకర విజయంపై ప్రవచనాలు జరుగుతాయని గుజరాతీపేట రాజరాజేశ్వరీ పీఠం నిర్వాహకులు పెంట రామచంద్రశేఖరశర్మ తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు ప్రారంభమవుతాయని అందరూ పాల్గొనాలని కోరారు.

పుస్తకావిష్కరణ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని డీసీసీబీ కాలనీలో జరుగుతున్న భూ సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాల సందర్భంగా కమిటీ గౌరవ అధ్యక్షుడు దుంపల సన్యాసిరావు రచించిన ఆధ్యాత్మిక జీవన జ్ఞాన నిధి పుస్తకావిష్కరణ సోమవారం జరిగింది. పుస్తకాన్ని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు బిందు కృష్ణ, కె.మధుసూదన రావు, శిష్టు ఉతాసన తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై విత్తనాలు పంపిణీ

జి.సిగడాం: మండలంలోని సంతవురిటి రైతు సేవా కేంద్ర ద్వారా రైతులకు రాయితీపై వివిధ రకాల వరి విత్తనాలను సోమవారం పంపిణీ చేశారు. స్థానిక సర్పంచ్ బుడారి లక్ష్మణరావు, మాజీ ఎంపీపీ బాలబొమ్మ వెంకటేష్, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, మడ్డువలస నీటి సంఘం ఉపాధ్యక్షుడు బాలబొమ్మ వెంకేశ్వరరావు, మాజీ సర్పంచ్ బత్తుల సన్యాసిరావు చేతులమీదుగా రైతులకు అందజేశారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ అలుగోలు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు



డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్సై లక్ష్మణరావు

ఎచ్చెర్ల: మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని లావేరు ఎస్‌ఐ జి.లక్ష్మణరావు హెచ్చరించారు. లావేరు మండలంలోని మురపాక గ్రామంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యంతాగి వాహనాలు నడపడం నేరమని, అటువంటి వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయనతో పాటు లావేరు పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఇదేం ట్రాఫిక్ బాబోయ్!



జె.ఆర్.పురం సీఐ కార్యాలయం వద్ద నిలిచిన వాహనాలు

జిల్లాలోని పలు రహదారుల్లో నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తోంది. వాహనాలు ముందుకు కదలక మండుటెండలో వాహనచోదకులు నరకయాతన అనుభవిస్తున్నారు. శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని కొత్త రోడ్డులో చర్చి వద్ద కల్వర్టు పనులు పూర్తికాకపోవడంతో ట్రాఫిక్ సమస్య నిత్యకృత్యంగా మారింది. భారీ వాహనాలు ఒక్కోసారి కూరుకుపోవడంతో ఇటు ఆమదాలవలస నుంచి వచ్చే వాహనాలు, అటు శ్రీకాకుళం నుంచి వచ్చే వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరుతున్నాయి. ఇదే రోడ్డు సోమవారం ఓ అంబులెన్సు సైతం చిక్కుకుంది. రణస్థలం మండల కేంద్రంలోని జె.ఆర్.పురం సీఐ ఆఫీస్ (పాత పోలీస్ స్టేషన్) వద్ద కూడా నిత్యం ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. ఓవైపు రావాడ నుంచి, మరోవైపు సర్వీస్ రోడ్డు నుంచి ఇష్టారాజ్యంగా వాహనాలు వచ్చి రోడ్డుపైనే పెట్టేస్తుంటంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది.

–శ్రీకాకుళం రూరల్/రణస్థలం



కొత్త రోడ్డు సమీపంలో స్తంభించిన ట్రాఫిక్